క్లుప్తంగా

జిల్లా యోగా సంఘం ఎన్నికలు ఏకగ్రీవం



ఎన్నికైన నూతన జిల్లా యోగా సంఘం

తిరుపతి సిటీ: జిల్లా యోగ సంఘం ఎన్నికలు స్థానిక చెన్నారెడ్డి కాలనీ లిటిల్ స్టార్ స్కూల్లో యోగా సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ ఎన్నికలలో జిల్లా అధ్యక్షుడిగా డాలర్స్ దివాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బి.రాజేష్ రాయల్, ప్రధాన కార్యదర్శిగా కే.వెంకటరమణ, జాయింట్ సెక్రటరీగా మాధవి, కోశాధికారిగా రెడ్డికుమార్, ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్స్ గేయం ఆదర్శ్ సతీష్, సీహెచ్ మహేష్, శ్రీధర్, అపర్ణ దేవి ఎన్నికయ్యారు

యుద్ధాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం



మాట్లాడుతున్న కె.నారాయణ

తిరుపతి కల్చరల్: ప్రపంచ దేశాలు అవలంభిస్తున్న యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పిలుపు నిచ్చారు. సాంస్కృతిక సహకార స్నేహ సంఘం, అభ్యుదయ హిరోషిమా నాగసాకి డే సందర్భంగా బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ వచ్చాక ఇజ్రాయెల్‌తో సంబంధం పెట్టుకున్నారని.. అమెరికాతో ఆ దేశం బాగుంటుంది గనుక ప్రతి యుద్ధం వెనుక ఆర్థిక దోపిడీ జరుగుతోందన్నారు. అభ్యుదయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రమణ మాట్లాడుతూ అమెరికా యుద్ధోన్మాదాన్ని ఎండగట్టాలన్నారు. ప్రపంచంలో అనేక దేశాలకు అమెరికా ఆజ్యం పోస్తోందన్నారు. సమావేశంలో సీపీఐ నేతలు హరినాథ రెడ్డి, పి.మురళి, ఇస్కఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్, గోవిందస్వామి పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ ఉపకర్మ



గోవిందరాజస్వామివారికి ఉపకర్మ, ఆస్థానం చేపడుతున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రావణ ఉపకర్మ ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 6.30 గంటలకు శ్రీగోవిందరాజస్వామి, శ్రీకృష్ణుడిని కపిలతీర్థంలోని ఆళ్వార్ తీర్థానికి ఊరేగింపుగా వేంచేపు చేశారు. అక్కడ స్వామివారికి స్నపన తిరుమంజనం, హోమం, ఆస్థానం చేపట్టారు. సాయంత్రం 4.30 గంటలకు గోవిందరాజస్వామి వారు ఆర్ఎస్ మాడవీధిలోని శ్రీవైఖానసాచార్యుల అలయంలోకి వేంచేపు చేసి అక్కడ ఆస్థానం చేపట్టారు. అనంతరం తిరిగి ఆలయానికి చేరుకున్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు

తిరుపతి అన్నమయ్యసర్కిల్: తొండమాన్‌పురం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం ఉదయం పూర్ణాహుతితో పవిత్ర ఉత్సవాలు ముగిశాయి. ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి, సహస్రనామార్చన, పవిత్ర విసర్జన, మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను స్నపన తిరుమంజనం ఘనంగా జరిగింది. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనములతో అభిషేకం చేశారు. సాయంత్రం 6 గంటలకు స్వామి, అమ్మవార్లు తిరుచ్చిపై గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుధీర్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



చిన్నారులకు జ్ఞాపికలను అందజేస్తున్న గుండాల గోపినాథ్ రెడ్డి, శిల్పారాం నిర్వాహకులు

చంద్రగిరి : స్థానిక శిల్పారామం వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం సాయంత్రం చంద్రగిరికి చెందిన శ్రీ వెంకటేశ్వరి నృత్యాలయం అకాడమీ ఆధ్వర్యంలో ప్రదర్శించిన భరతనాట్యం ప్రేక్షలకులను ఆకట్టుకుంది. అలరించిన చిన్నారులకు శిల్పారామం ఏఓ సూర్యతేజ, రాయలసీమ రంగస్థలం చైర్మన్ గుండాల గోపీనాథ్, రాధాకృష్ణ జ్ఞాపికలను అందజేశారు.

చెత్తశుద్ధి లేదా ?





నగరంలో పేరుకుపోయిన చెత్తకుప్పలను జోరు వర్షంలోనే పరిశీలిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

"నిత్యం శ్రీనివాసుడి నామస్మరణతో మార్మోగే ఆధ్యాత్మికం నగరంలో కనీసం పారిశుద్ధ్యం నిర్వహించలేని దుస్థితిలో పాలకులు ఉన్నారు.. నగరంలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి.. కూటమి ప్రభుత్వం వచ్చాక నగరంలో మందు, గంజాయి.. డ్రగ్స్‌కు కేంద్రబిందువుగా మార్చేశారు.. పారిశుద్ధ్యం ఇంత దారుణంగా ఉంటే కనిపించడం లేదా ? ఎంతసేపూ మద్యం వ్యాపారం.. అవినీతి, అక్రమవ్యాపారాలేనా ?" అంటూ వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన జోరు వానలో పార్టీ శ్రేణులతో కలిసి తిరుపతిలోని 44వ డివిజన్ సుందరయ్యనగర్‌లో గుట్టలు గుట్టలుగా పేరుకుపోయిన చెత్తకుప్పలను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు.

– తిరుపతి మంగళం

నోటీస్ బోర్డు

- శంకరంబాడి సాహితీ పీఠం ఆధ్వర్యంలో లక్ష్మీపురం సర్కిల్లోని శంకరంబాడి విగ్రహం వద్ద ఉదయం 8.30 గంటలకు శంకరంబాడి జయంతి వేడుకలు
- మంగళం రోడ్డులోని ఆశా కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు అప్సా వార్షిక సదస్సు ముగింపు సమావేశం
- శ్రీఅన్నమాచార్య డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ సంస్కృతి వర్సిటీలోని ఓపెన్ ఆడిటోరియంలో తెలుగు బుక్ ఆఫ రికార్డ్ నమోదులో భాగంగా ఉదయం 8 నుంచి 12 గంటల వరకు భగవద్గీత పారాయణం, నృత్యగానం
- శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, తారకరామ స్టేడియంలో అథ్లెటిక్స్ స్పోర్ట్ మీట్‌లో భాగంగా వివిధ క్రీడాపోటీలు

శాస్త్రోక్తంగా తైలాభిషేకం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామి వారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అభినయ్‌కి రాఖీ శుభాకాంక్షలు



భూమన అభినయ్‌రెడ్డికి రాఖీ కడుతున్న పార్టీ మహిళలు

తిరుపతి మంగళం : రాఖీ పండుగ సందర్భంగా పద్మావతిపురంలోని భూమన నివాసం వద్ద వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డికి శనివారం పార్టీ మహిళలు రాఖీ కట్టి సోదరభావం చాటుకున్నారు. అనంతరం రాఖీ కట్టిన పార్టీ అక్కచెల్లెమ్మల ఆశీర్వాదం తీసుకున్నారు. తోడపుట్టిన అక్కచెల్లెమ్మలుగా మహిళలను చూసుకుంటూ పార్టీలో మహిళలకు ఉన్నతస్థానం కల్పిస్తున్న వ్యక్తి భూమన అభినయ్‌రెడ్డి అని మహిళలు కొనియాడుతూ సంతోషంగా ఆశీర్వదించారు.

11న స్మార్ట్‌మీటర్ల రద్దుకు ధర్నా



ధర్నా కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నేతలు

తిరుపతి కల్చరల్: కూటమి ప్రభుత్వం మోసపూరితంగా ప్రజలపై పెనుభారం మోపుతూ అమలు చేయనున్న స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా ఈనెల 11న ఏపీ ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద జరుగనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత పి.వెంకటరత్నం పిలుపునిచ్చారు. ఈ మేరకు ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో శనివారం ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అదానీ కంపెనీ రెండు కోట్ల మంది విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేస్తోందన్నారు. స్మార్ట్‌మీటర్లతో ముందుగా ప్రజలు డబ్బులు చెల్లించి కరెంటును కూడా రీచార్జ్ చేసుకోవాల్సిన పరిస్థితి రానుందన్నారు. ఈ నేపథ్యంలో దీనికి వ్యతిరేకంగా 11న జరిగే ఆందోళనలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

ప్రజలంతా భాగస్వాములు కండి

స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకిస్తూ ఈనెల 11న వామపక్ష, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాలో ప్రజలంతా భాగస్వాములై విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం సీపీఐ కార్యాలయంలో ధర్నా కరపత్రాలను ఆవిష్కరించి ప్రసంగించారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై శ్రీవారు



గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న స్వామి

చంద్రగిరి : శ్రీనివాస మంగాపురంలో వెలసిన శ్రీకళ్యాణ వెంకటేశ్వర స్వామి వారు శనివారం గరుడ వాహనంపై భక్తులను కటాక్షించారు. శ్రావణమాసం శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్లకు వైఖానస ఆగమోక్తంగా కలాజ్యోత్సవాన్ని కనుల పండువగా జరిపారు. తదుపరి సాయంత్రం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్లకు విద్యుత్ కాంతుల నడుమ ఊంజల్ సేవను నిర్వహించారు. అనంతరం గరుడిపై స్వామి వారు ఆశీనులై మాడా వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మితో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా చండీహోమం



పూర్ణాహుతి చేపడుతున్న అర్చకులు, ఆలయ అధికారులు

తిరుపతి కల్చరల్: శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శనివారం చండీహోమం వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో అర్చకుల వేదమంత్రోచ్చరణల నడుమ చండీహోమం శాస్త్రోక్తంగా చేపట్టారు. ఉదయం 8.45 గంటలకు ఆరంభమైన హోమం 11.30 గంటలకు చేపట్టిన పూర్ణాహుతితో పరిసమాప్తమైంది. ఈ హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని భక్తి శ్రద్ధలతో కొలిచారు. హోమంలో పాల్గొన్న భక్తులందరికి పసుపు, కుంకుమ, గాజులు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆలయ ఈఓ జయకుమార్, అర్చకులు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యల పరిష్కారానికి పోరాటాలు



మాట్లాడుతున్న అమరావతి జేఏసీ జిల్లా అధ్యక్షుడు అశోక్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: దీర్ఘకాలిక పెండింగ్ సమస్యల సాధనకు ఉమ్మడి పోరాటాలే శరణ్యమని అమరావతి జేఏసీ జిల్లా అధ్యక్షుడు అశోక్‌రెడ్డి తెలిపారు. ఏపీ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో శనివారం ఉద్యోగుల సంఘం నెలవారి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అమరావతి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు నాయకత్వంలో రానున్న రోజుల్లో ఉద్యోగులు, పెన్షనర్లు, ఉపాధ్యాయులు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఉమ్మడి పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఇందులో ముందు వరుసలో పెన్షనర్ల సభ్యులు, పెన్షనర్ నాయకులే కీలకమని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, కోశాధికారి సిద్ధయ్య, తిరుపతి శాఖ కార్యదర్శి వెంకటేశం శెట్టి, నగర కోశాధికారి మునికృష్ణ, టీవీ రమణ, గోపాల్, ఏపీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్‌వీ శాస్త్రి, పెన్షనర్ల సంఘ నేతలు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు అభిమానుల సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: సూపర్ స్టార్ మహేష్ బాబు 50వ పుట్టిన రోజు సందర్భంగా సూపర్ స్టార్ కృష్ణ, మహేష్‌బాబు అభిమానుల ఆధ్వర్యంలో శనివారం తుడా కార్యాయం సర్కిల్లో పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో సూపర్ స్టార్ కృష్ణ, మహేష్‌బాబు అభిమానుల సంఘం నగర అధ్యక్షుడు వెంకటేష్, అభిమానులు పాల్గొన్నారు.

ఏపీజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హరిబాబు



తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం (ఏపీజేఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తిరుపతికి చెందిన మద్దినేని హరిబాబు ఎన్నికయ్యారు. ఏపీజేఎఫ్ రాష్ట్ర కమిటీ ఎన్నికలు శనివారం విజయవాడలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి జర్నలిస్టులు, మీడియా పత్రికల ప్రతినిధులు, జర్నలిస్టు సంఘాల నేతలు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహా టీవీ సీఎండీ వంశీకృష్ణ ఆధ్వర్యంలో కృష్ణ ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏకగ్రీవంగా కొత్త రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా రాజేష్ ఎంపికయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు శిక్షణా శిబిరాలు, సదస్సులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామని తెలిపారు.

11న శ్రీకాళహస్తిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తిరుపతి : శ్రీకాళహస్తి నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం ఈ నెల 11వ తేదీన సోమవారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. శ్రీకాళహస్తి పంచాయతీ రాజ్ అతిథి గృహంలో జరిగే ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో డివిజనల్ అధికారులు పాల్గొంటారని చెప్పారు. అలాగే తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో 11వ తేదీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం యధావిధిగా జరుగుతుంది. కలెక్టర్ కార్యాలయ జిల్లా అధికారులు పాల్గొంటారు.

అభినందనలు



భూమన అభినయ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ యువజన విభాగం నాయకులు

తిరుపతి మంగళం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పార్టీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా తిరుపతి పద్మావతిపురంలోని భూమన నివాసం వద్ద శనివారం పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లం రవికుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ, నగర అధ్యక్షుడు దినేష్‌రాయల్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో భూమన అభినయ్‌రెడ్డికి దుస్సాలువలు కప్పి పుష్పగుచ్ఛాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

తిరుపతిలో చిరుజల్లులు

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో గడిచిన మూడు రోజులుగా వర్షం పడుతోంది. శనివారం సాయంత్రం నగరంలో చిరుజల్లులు పడ్డాయి. వాతావరణం చల్లబడినట్లే ఉన్నా ఉక్కపోత మాత్రం తగ్గడం లేదు. మధ్యాహ్నం వరకు ఎండ ఉక్కపోత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది. సాయంత్రం వేళ మబ్బులు కమ్మి చిరుజల్లులు పడుతుండడంతో రాత్రి వేళ వాతావరణం చల్లబడుతోంది. సాయంత్రం నుంచి ఆకాశాన్ని నల్ల మబ్బులు కమ్మేశాయి. ఐదు గంటల ప్రాంతంలో చిరుజల్లులు తిరుపతిని తాకాయి.

కలెక్టర్ వారి కార్యాలయంలో..

తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన శ్రీపద్మావతి అతిథి భవనాన్ని జిల్లాల పునర్విభజన సమయంలో తిరుపతి కలెక్టరేట్‌కు కేటాయించిన తెలిసిందే. రాష్ట్రంలో ఏ జిల్లాలో లేనివిధంగా తిరుపతి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎంతో విశాలంగా మెరుగైన సౌకర్యాలతో ఉంది. అయితే దీన్ని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని ప్రజలు కోరుతున్నారు. కానీ కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలు అధ్వానంగా ఉండడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.

- కంపు కొడుతున్న మరుగుదొడ్లు
- సోమవారం మాత్రమే శుభ్రం చేస్తున్న వైనం
- పెచ్చులూడిపడుతున్న శ్లాబ్
- వర్షం వస్తే చాలు పగుళ్ల రేకుల నుంచి కార్యాలయంలోకి నీళ్లు



టాయిలెట్స్‌లోని ఓ గదిలో ఇసుక బస్తాతో పాటు చెత్తకుప్పలు



ఏ బ్లాక్‌కు వెళ్లే మొదటి అంతస్తు మార్గంలో మెట్లు కిందిభాగంలో దెబ్బతిన్న శ్లాబ్



టాయిలెట్స్ వద్ద నిత్యం లీకేజీలతో పాచిపట్టిన కింది భాగం



మరుగుదొడ్ల సమీపంలో బీ బ్లాక్‌కు వెళ్లే మొదటి అంతస్తు మార్గంలో స్లాబ్ నుంచి ఊడుతున్న సిమెంట్ పెచ్చులు



క్యాంటీన్‌కు వెళ్లే మార్గంలో పైభాగం నుంచి లీకేజీలతో నిత్యం పడుతున్న నీటి బిందువులు

తిరుపతి అర్బన్: జిల్లా కలెక్టరేట్ కార్యాలయం అంటేనే జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఆదర్శంగా ఉంటుంది. కానీ తిరుపతి కలెక్టరేట్‌లో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కార్యాలయంలో పలుచోట్ల శ్లాబ్ నుంచి పగుళ్ల రావడంతో పెచ్చులు ఊడిపడుతున్నాయి. దీంతో కార్యాలయ ఉద్యోగులు.. ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు కలెక్టరేట్ ఏ బ్లాక్‌లోని ఏడు అంతస్తుల్లో రేకులు పెద్దఎత్తున పగుళ్ల వచ్చేశాయి. దీంతో గతేడాది నుంచి చిన్నపాటి వర్షం వచ్చినా వర్షపు నీరు అగ్నిమాపక చాంబర్‌లోకి, డీఈఓ, హౌసింగ్ కార్యాలయాల్లోకి వచ్చేస్తోంది. గతేడాది నవంబర్‌లో ఇలానే వర్షపు నీటితో జారిపడి ఇద్దరు అగ్నిమాపక విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు గాయాలైన సంగతి తెలిసిందే. అయినప్పటికీ కలెక్టరేట్ అధికారులు రేకుల పగుళ్ల విషయంలో నిర్లక్ష్యంగా వహిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. అలాగే క్యాంటీన్‌కి వెళ్లే మార్గంలో శ్లాబ్ నుంచి ఉరుస్తోంది. అయితే మురుగునీరు పైభాగంలో నుంచి చినుకుల్లా బిందువులు పడుతూనే ఉన్నాయి. దాన్ని పట్టించుకునే వారు కరువయ్యారని పలువురు వాపోతున్నారు.

అధ్వానంగా మరుగుదొడ్లు

మరోవైపు కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చే వారి కోసం గ్రీవెన్స్ చాంబర్ సమీపంలోని ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి. సోమవారం గ్రీవెన్స్ నేపథ్యంలో ఆ రోజు ఉదయం మాత్రమే శుభ్రం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత వాటిని పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కొన్ని టాయిలెట్స్ గదుల్లో ఇసుక బస్తాలు, చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఉన్నది నాలుగు కొళాయిలు అందులో ఒకటి రెండు కొళాయిల్లో నీళ్లు రావడం లేదని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల సోమవారమే కాకుండా మిగిలిన రోజుల్లోను తమ సమస్యలను అధికారులకు చెప్పుకోవడానికి అర్జీదారులు వస్తూనే ఉన్నారు. ఆ సమయంలో వారు టాయిలెట్స్ లోకి పోవాలంటే ముక్కులు మూసుకుని పోవాల్సి వస్తోందంటూ పలువురు వాపోతున్నారు. అధికారులు స్పందించి టాయిలెట్స్‌ను శుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు మండిపడుతున్నారు. అలాగే దెబ్బతిన్న స్లాబ్ నుంచి సిమెంట్ పెచ్చులు ఊడి పడకుండా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.